


# రేపటికోసం

'కవిత'

"ఏమిటలా ఉండిపోయావు, గడియారపు గంటలు వింటూ? ఎప్పుడూ వినే గంటలేగా? ఇవాళ నీకు వాటిలో కొత్తగా సంగీతం వినిపిస్తూందా?" నవ్వుతూ కళ్యాణి భుజంమీద చేయి వేశారు రామనాథం.

"అదికాదు... మనం యివాళ భోజనాల దగ్గర గంటసేపు కూర్చున్నాం. అది నిజంగానే కొత్తగానూ వింతగానూ అనిపిస్తూంది. అందుకని" ఆయన చేతులని తన చేతుల్లోకి తీసుకుంటూ అందామె. ఆమె కళ్ళల్లోకి ఏదో వింత కాంతి వొచ్చింది.

"నువ్వలా ఆశ్చర్యపడడం ప్రారంభిస్తే-యికనుంచి నీ కంతా ఆశ్చర్యకరంగానే ఉంటుంది. చూ. కళ్యాణీ, విన్నా నేను కంగారైపోయాను. అందుచేత ఆఫీసుకి పరుగెత్తి వెళ్ళాల్సిన అగత్యం తప్పిపోయింది. ఇరవైనాలుగు గంటలూ యిక మనమే మరి." అంటూ మంచం మీద కూర్చున్నారు. ఆయన మనసులో నిన్నటి జ్ఞాపకం తాలూకు చిన్న అల.

తోటి ఉద్యోగుల ప్రశంసలు....అధికారి-ప్రావిడెంట్ ఫండూ, గ్రాట్యుటీ అందించడం....అభిమాన పూర్వకంగా కానుక యివ్వడం. వీడ్కోలు సభకు తను కృతజ్ఞతలు తెలియజేయడం. భారంగా వారందరి నుండి సెలవు తీసుకోడం....

ఆయన మౌనానికి ఆమెకేమర్థం స్ఫురించిందో ఏమో-[illegible]లపాకులు చీల్చుతున్నవల్లా ఆగి-"పదవీ విరమణ చేసినందుకు బాధపడుతున్నారా?" అడిగింది జాలిగా.

ఆయన కొంచెం గట్టిగానే నవ్వారు. "బాధా!? లేదు కళ్యాణీ.. లేదు....చాలా సంతోషిస్తున్నాను నిజానికి నే నీ రోజు

గురించి ఎంతగా ఎదురుచూశానని! ఎన్ని కలలు కన్నానని!"

ఆమె తాంబూలం అందించింది. ఆయన దానిని సగంచేసి ఒక భాగం ఆమె నోటికందించారు. ఆమె సిగ్గు పడుతూనే అందుకుని- తలవంచుకుంది. ఆమెకెంతో సంతోషంగా వుంది. ఇలాగ ఆయనా తనూ కబుర్లు చెప్పుకుంటూ ప్రేమికంగా భోజనం చేయడం.... ఇలా కూర్చుని హాయిగా కబుర్లు చెప్పుకోవడం- ఆమెకు వింతగానూ ఉంది సంతోషంగానూ ఉంది ఎంతో.

"ఏరు దాటాక తెప్ప తగలెయ్యడం కాదుగానీ- ఉద్యోగానికి.. అది నెల నెలా యిచ్చే జీతంకోసం నే నర్పించుకున్నవీ అంకితం చేసుకున్నవీ కుదువ పెట్టుకున్నవీ తక్కువ విలువైనవేమీ కావు. ముఖ్యంగా- కాలం."

నిజమే అనిపించిందామెకు. ఉద్యోగంలో ఉండగా.... అంటే.... నిన్నటి వరకూ ఆయన ఏనాడూ చీకటిపడి దీపాలు పెట్టాక కానీ యిల్లు చేరేవారు కాదు. ఆదివారాలూ శలవు రోజులూ కూడా అంతే. ఎవరో కబురు చేయడం, ఈయన వెళ్ళడం... ఎప్పుడో తిరిగి రావడం నిజాని కాయన యింట్లో మనిషిలా కాకుండా అతిథిలా అనిపించేవారు. ఎప్పుడూ యింట్లో ఉండని ఆయనను తలుచుకుంటే బాధే వేసేది మనసుకి.

"సినిమాకి వెళ్దామనేదానివి నెలల తరబడి నాకు కుదిరేదే కాదు. చివరికి నిన్నొక్కర్తివీ వెళ్ళమనేవాణ్ణి. బహుశా అప్పుడు నన్ను మనసులేని మనిషిలా- మరలా భావించి వుంటావు. కాదా?"

"ఇప్పుడవన్నీ దేనికి? ఆ రోజులు గడిచిపోయాయిగా...."

"కాదు. ఒకసారి ఆ చేదురోజులని నెమరువేసుకోవలసిన అవసరం యిప్పుడు చాలానే ఉంది. చెప్పు కళ్యాణీ, నేను నీకు సరదాలు తెలియని మనిషిలా, జడుడిలా తోచేవాడిని కదూ?"

"ఏమీ కాదు. నేను మీ గురించి ఎప్పుడూ అలా భావించలేదు."

"నువ్వు మంచిదానివి మరి. సారీ కళ్యాణీ.... నీ కెంతో యిష్టమైన సినిమాలు.... చిన్న కోరిక... అది కూడా తీర్చలేకపోయేవాడిని. ఉద్యోగి కూడా ఒక విధమయిన బానిసా, అస్వతంత్రుడే సుమా! కనీసం కొందరు ఉద్యోగులు." ఆమె వ్రేళ్లను మృదువుగా నొక్కుతూ అన్నాడు.

"మీతో కలిసి చూస్తేనే సినిమా ఇష్టం. ఒంటరిగా కాదు."

"నీకు మంచి మంచి చీరలు కట్టుకోవాలని ఉండేది ఖరీదయిన నగలు పెట్టుకోవాలని ఉండేది కానీ- ఒకటి రెండుసార్లు తప్ప నువ్వు నోరు విడిచి అడిగలేదు!"

"ఎలా అడిగేది? మొదట్లో చిన్నతనం కొద్దీ కోరికలుండేవి. నిజమే కాని.... తర్వాత పరిస్థితి అర్థమయింది. మన

ముందు రెండు మహత్తరమయిన బాధ్యతలు. అబ్బాయికి పెద్ద చదువు చెప్పించి మంచి ఉద్యోగస్తుణ్ణి చేయాలి. అమ్మాయికి చదువు చెప్పించి చక్కని సంబంధం చెయ్యాలి. వీటికి తక్కువ డబ్బు చాలదు. అందుకని.. మనం చాలా పొదుపుగా సంసారం చేసేవాళ్లం. క్లుప్తంగానూ నిరాడంబరంగానూ గడుపుతూ మీ జీతంలోనే వెనకేసేవాళ్లం, పిల్లల భవిష్యత్తు కోసం. మనకి వేరే ఆస్తిపాస్తులు లేవుగా.... ఉండేది మీ జీతం ఒక్కటే. అది తెలిశాక.... పరిస్థితి అర్థం చేసుకోగలిగాక మిమ్మల్ని నా కోరికలతోనూ అజ్ఞానంతోనూ ఎలా బాధించగలను? మీరు మాత్రం పిల్లలకోసం మీ కోరికలను చంపుకునేవారు కాదూ? నేను ప్రత్యేకంగా చేసిందేముంది. మీ అడుగుజాడల ననుసరించడం తప్ప?"

"అలా కాదులే. సహజంగా ఆడవాళ్లకి కోరిక లెక్కువంటారు."

"తెలియనివాళ్లనే మాట అది."

"కోరికలుండడం నేరమేమీ కాదు కళ్యాణీ. ఆ మాటకొస్తే మనిషన్నాక కోరికలూ సరదాలూ ఉండకపోతేనే తప్పు."

ఆమె అదోలా నవ్వి ఊరుకుంది.

"కళ్యాణీ.... నిన్ను సుఖపెట్ట వలసిన వయసులో.. సరదాలు తీర్చ వలసిన సమయంలో.. అన్యాయంగా.. బాధ్యతలతోనూ బరువులతోనూ బాధలతోనూ నడిపించాను. ఇది.. కాదనలేని నిజం. నన్ను.... క్షమించవూ?"

దీనంగా ఆమెవంక చూశాడు

"వద్దు... మీరలా మాట్లాడితే నేను వినలేను, భరించలేను." అంటూ తన వేళ్లతో ఆయన నోటిని మూసింది. ఆమె చేతులను ఆయన తన చేతులలోకి తీసుకున్నాడు.

ఒకటి రెండు నిముషాలు మౌనంగా గడిచిపోయాయి

"అప్పుడు మన ధ్యేయాలు రెండే. అబ్బాయి చదువూ, అమ్మాయి వివాహమూ. ఆశ్చర్యకరంగా ఇవాళ ఉదయమే అమ్మాయి అత్తవారింటికి వెళ్లింది. అమ్మాయిని అత్తవారింటికి పంపాము. అంటే.. యివాళ్టినుంచీ మనకి బాధ్యతనేదే లేదన్నమాట! ఉద్యోగ విరమణ కూడా చేసేశానుగా. నా కెంత ఆనందంగా ఉందో చెప్పలేను కళ్యాణీ! అబ్బాయి నాలా యిరుకు బ్రతుకూ వాయిదాల బ్రతుకూ అక్కర్లేకుండా హాయిగా జీవించవచ్చు. కలెక్టరంటే చాలా పెద్ద ఉద్యోగం కదా!"

"ఔను కట్నం కొంచెం ఎక్కువయినా అమ్మాయికి కూడా అన్నివిధాలా మంచి సంబంధమే కుదిరింది. అల్లుడు యోగ్యుడూ గుణవంతుడూ. అమ్మాయి చాలా సుఖపడుతుంది. ఆ విషయంలో మన కేవిధమయిన చింతా అక్కర్లేదు.




**జీవితంలో మీరు చేయవలసిన పెద్దత్యాగం యిదే!**
**అంటే- ఆ అమ్మాయితో మీ పెళ్లి!!**

---

అబ్బాయీ అమ్మాయీ ఒక్కసారే వెళ్లిపోవడంతో యిల్లు చిన్నబోయింది." ఆమె కంఠంలో చిరుజీర.

ఆమెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంటూ— "వొద్దు కళ్యాణీ! బాధ పడొద్దు. ఇది మనం ఎంతగానో ఎదురు చూసిన రోజు. కోరుకున్న శుభదినం. అందుచేత మన మనసులలో లేశమయినా విచారం ఉండకూడదు." అన్నాడు.

ఆ కంఠంలోని ఉద్వేగానికి కామె కొంచెం ఆశ్చర్యపడుతూ చూసింది ఆయన కళ్లల్లోకి. ఎందుకో ఆయన కొత్తగా కనిపించారు.

"ఇన్నాళ్లూ మనం మన కోరికలను బలవంతంగా కత్తిరించుకున్నాం. చిన్న చిన్న సరదాలను కూడా వాయిదా వేసుకున్నాం. ప్రతుకుని యిరుకుచేసుకున్నాం. ఇక ఆ విషాదపు అధ్యాయం ఐపోయింది. మన జీవితాలలో నేటి నుంచీ నూతనాధ్యాయం ప్రారంభమౌతుంది. మనకి దేనికీ లోటులేదు. మనకి అంతా సంతోషమే. కళ్యాణీ! వింటున్నావా? అర్థం చేసుకుంటున్నావా?"

"ఊఁ." ఆయన ఆమెకు చాలా చిత్రంగా కనిపిస్తున్నాడు.

"బీరువాలో తోలుసంచీ ఉంది. అందుకో."

ఆమె లేచి పెళ్లి తెచ్చింది.

"తెరచి చూడు."

ఆమె ఒక్కసారి విభ్రాంతురాలయింది. ఎంత డబ్బు! కొత్త నోట్ల కట్టలు. ఆమెకు ఆశ్చర్యంతో నోరు పెదలేదు.

"ఇదంతా మనదే. మన ఇద్దరి కోసమే. ఇంకా బ్యాంకులో ఉంది చాలా. ఇదంతా మనం ఖర్చు పెట్టుకుందుకే. మనం సరదాగా. కోరికలు తీర్చుకుందుకు. కళ్యాణీ! మన మిక కోరికలు చంపుకోనవసరంలేదు. పెంచుకోవచ్చు. తీర్చుకోవచ్చు అటువంటి అవసరం రాదు. కావీ కావాలంటే అబ్బాయి పంపుతాడు. నీ కేమేం కావాలి?"

ఆమెకంతా వింతగానూ చిత్రంగానూ ఉంది. గొంతు విప్పలేకపోతూంది. ఏమిటో ఉక్కిరిబిక్కిరిగా ఉంది. ఆయన వంక ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది.

"చెప్పు కళ్యాణీ! నువ్వు అణుచుకున్న కోరికలు.... తీర్చుకోకుండా మిగిలిపోయిన సరదాలు.... చెప్పు."

కావలసిన వరాలన్నీ కోరుకోమంటున్న ఇలవేలుపు లాగే కనిపించారాయన ఆమెకు. అంతాఏదోఅద్భుతంలా అనిపిస్తూ ఆమె మాట్లాడలేకపోతూంది.

ఆమె ముఖాన్ని చేతులలోకి తీసుకుని- కళ్లల్లో కళ్లుపెట్టి చూస్తూ- "నిజమే, నువ్వు చెబుతే ఏం బాగుంటుంది? నేనే గ్రహించి తీరిస్తే అందమూ చందమూ. ఔను కదూ? అదేకదూ నీ ఉద్దేశం?...." నవ్వాడు.

ఆమె సిగ్గుపడుతూ కళ్లుమూసుకుంది.

"నిద్ర వస్తూందా?"

"ఉహుం, లేదు. ఎందుకూ?"

"లేచి తయారయితే బజారుకి వెళ్దాం."

ఆమె లేచింది. ఐదు నిముషాలలో చీర మార్చుకుని- తయారయింది. అప్పటికి ఆయనా సిద్ధంగానే ఉన్నారు. ఇద్దరూ ఇంటినుంచి బయటకు వచ్చి గేటుకితాళంవేసి రోడ్డుమీదనిలుచున్నారు.

"మరచిపోకు. మనం ప్రారంభించబోతున్న కొత్త జీవితాని కిదే నాంది." హెచ్చరిస్తున్నట్లే అన్నారు. ఆమె మౌనంగా తల ఊపింది. ఇంతలో రిక్షా రానే వచ్చింది. ఇద్దరూ ఎక్కి కూర్చున్నారు. రిక్షా వేగంగా పరుగెడుతూంటే ఆమెకు చాలా సంతోషం వేసింది. ఆయన పక్కన కూర్చుని యిలా వెళ్లడం ఆనందంగా ఉంది. కొత్తగా ఉంది. ఔను.

"మీరు మంచి సూటు తీయించుకోవాలని అనుకునేవారు. గచ్చకాయ రంగుది. తరువాత వాచీ.... బూటు.... ముందుగా అవి తీసుకుందాం—" మెల్లగా అంది.

"కళ్యాణీ!" ఆప్యాయంగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కాడు. ఈమెకు తనంటే ఎంత అభిమానం! ఎంత అనురాగం! ఎంత ప్రేమ!

ఆమె సిగ్గుపడుతూ చేతిని వెనక్కి తీసుకుంది.

"మనం వెళ్తున్నది చాలా కొనుక్కో-

వాలనే. నువ్వు డబ్బుకి వెనుకాడకు. బరువులూ బాధ్యతలూ తీరి ఆర్థికంగా స్వేచ్ఛ లభించింది. దేనికీ తడుముకో నక్కరలేదు. లోటు పడవలసిన అగత్యం లేదు. అప్పుడు అనుభవించలేని సుఖాలూ సరదాలూ యికనైనా తీర్చుకుందాం. ఒక విధంగా - ఇది - గతంలో జీవించిన యిరుకు బ్రతుక్కి - పరిహారం చెల్లించుకోడం అన్నమాట. అనాటి జీవితానికి నిష్కృతిని వెదుక్కోవడం. అర్థమైంది కదూ? నీ ఏ కోరికా.... ఊహూ. మన ఏ కోరికా తీరకుండా మిగిలిపోకూడదు. ఏం?"

"ఊఁ." అంది ఆమె - ఆయన పూర్తిగా అర్థంచేసుకున్నట్లు.

ఇద్దరూ కొత్తలోకంలో.... ఊహా ప్రపంచంలో విహరించసాగారు రిక్షా పరుగెడుతూంటే.

కొత్త సూటు.... బూటు.... చేతికి వాచి.... హుందాగా కనిపిస్తున్నారు రామనాథం, కళ్యాణి కలలలో.

జార్జెట్ చీర... రవ్వల నెక్లెస్.... ముక్కుపుడక.... నగలలో మెరిసి పోతూ ఎంతో అందంగా సాక్షాత్కరిస్తూంది కళ్యాణి రామనాథం ఊహలలో. ఆమె కింతవరకూ అందించలేకపోయిన వన్నీ అందించాలని ఆయన తెగ ఆరాట పడుతున్నాడీ క్షణాలలో.

నగరంలోకల్లా ఖరీదయిన క్లాత్ స్టోర్ ముందుకి రాగానే రిక్షా ఆపమని దిగారు. షాపులోకి నడిచారు. వేళకానివేళ కావడంవల్ల కాబోలు - షాపు రద్దీగా లేదు. సేల్స్‌మాన్ వీళ్లని సాదరంగా ఆహ్వానించాడు చిరునవ్వుతో. వీరిద్దరినీ కూర్చోబెట్టి - బట్టలు గుట్టలుగా పడెయ్య సాగాడు.

రామనాథం ముందు - గ్లాస్కో పంచెలూ.... షర్టు చాపులూ.... పాప్లిన్ షర్టింగులూ, కళ్యాణి ముందు - జరీ చీరెలూ.... పట్టు చీరెలూ.... మూధ వరం.... పెడన చీరెలూ. ఒకటి రెండు నిముషాలు చూసి - మెల్లగా అన్నా రాయన: "జార్జెట్.... టెర్లిన్.... వూలీ వూలీ చీరెలూ.... లేటెస్ట్ ఫ్యాషన్ సూటింగులూ.... లేవూ?"

సేల్స్‌మాన్ ఆశ్చర్యంగా చూసి - "బట్టలు మీకు కాదా? చిన్నవాళ్లకా?" అన్నాడు. రామనాథంగారి ముఖం రంగులు మారింది. కళ తప్పింది. అనుకోని దెబ్బలా హృదయానికి బలంగా తగిలింది సేల్స్‌మాన్ ప్రశ్న. ఆయన అవాక్కయిపోయారు.

కళ్యాణి పరిస్థితి కూడా దాదాపు అలాగే వుంది. ఆమె తలవంచుకుని ఉండిపోయింది. భర్తను చేతులలోకి తీసుకుని చాలా ఓదార్చవలసిన అవసరం ఉందని ఆమెకు తెలుసు. కాని - వాళ్లున్నది షాపు!

"మళ్లీ వొద్దాంలే పద కళ్యాణీ!" నీరసంగా అన్నాడు. ఆమె ఆయన వెనక

నడవసాగింది. జీవితంలో చాలా ఓడి పోయినవాడిలా.... ఘోరంగా దెబ్బ తిన్నవాడిలా.... భారంగా అడుగులు వేస్తూ వెళ్తున్న ఆయనవంక ఆశ్చర్య పోతూ చూశాడు పేర్సమాన్. అతనికి అంతా అయోమయంగా అనిపించింది. తా నన్నదానిలో తప్పేముందని?

రామనాథంగారి ముఖంలోకి యింకా ఉత్సాహం రాలేదు. తగిలిన దెబ్బనుంచి ఆయన తేరుకోనట్లే మిగిలిఉన్నారు.

"మీరు బాధపడకండి...." మెల్లగా అంది కళ్యాణి.

"అదికాదు కళ్యాణీ...." ఆయన గొంతు గాద్గదికమైపోయింది. హృదయంలోని చాలా భారం కంఠంలోకి వచ్చేసినట్లుంది."ఇలాగ.... నా కలలు .. ఆశలు.... పగిలిపోతే దారుణంగా ఛిన్నాభిన్నమైపోతే ... అయ్యో!.... నే నెంతగా ఎదురుచూసిన రోజిది! నా ఊహలు...." ఆయన గొంతు తెగిపోయినట్లు ఆగిపోయారు.

ఆయన చేతిని గట్టిగా పట్టుకుందామె. ఆయన ఎక్కడ నిలువునా కూలిపోతాడో అని భయపడుతున్నట్లు. ఒక్కసారిగా ఆయనలో ఎంత నీరసం! ఎంత నిర్లిప్తత! తీవ్రమైన ఆశాభంగం తాలూకు ఛాయలు స్పష్టంగా ప్రతిఫలిస్తూ ఎంత మ్లానమైపోయింది ఆయన వదనం!

"సినిమాకి వెళ్దాం పదండి." అందామె. అలా ఐతే ఆయన ధ్యాస మళ్లుతుందేమో అని ఆశపడుతూ. ఆయన మౌనంగా ఆమె ననుసరించసాగాడు. టిక్కెట్లు తీసుకుని బాల్కనీలోకి నడిచారు. వాళ్లు కూర్చోవడమేమిటి, సినిమా ప్రారంభమైంది. కొంచెంసేపు గడిచేసరికి–

"చూడు రోజు లెలా మండిపోతున్నాయో! ముసలాళ్లకి కూడా 'ఏ' సర్టిఫికేటు సినిమాయే కావలసి వచ్చింది. మళ్లీ కుర్రవాళ్ల మీదకు తోసేస్తారు తప్పంతా. నిజానికి సెక్సు సినిమాలను పోషించేది, ప్రోత్సహించేది ముసలాళ్లే. కాలం!" వెనకనుంచి కామెంట్సు. ఇద్దరికీ కళ్లనీళ్ల పర్యంతం అయింది– ఆ మాటలు ... యీటెలలాటి మాటలు సూటిగా గుండెలలోకి గ్రుచ్చుకునేసరికి, ముళ్లమీదా మంటలమధ్యా ఉన్నట్లనిపించింది యిద్దరికీ.

"పోదాం కళ్యాణీ!"

"పదండి."

ఇద్దరూ యివతలికి వచ్చేస్తుంటే– వెనకనుంచి నవ్వు.

రామనాథం నడక వేగం బలవంతంగా పెంచి– రోడ్డుమీదకు వచ్చారు. ఆయన ముఖంనిండా పశ్చాత్తాపం. కళ్యాణి ముఖం చూడలేకపోతున్నారు.

ఇల్లు చేరడమేమిటి, అలసటగా మంచంమీద వాలిపోయాడు.

"ఏమైంది?" ఆత్రంగా అతని తలను వొడిలోకి తీసుకుని నుదుటిమీద వేళ్లతో రాయసాగింది కళ్యాణి ఆ స్పర్శ– నీటి

మేఘానికి చల్లగాలిలా తగిలి– ఆయన విగ్రహం పూర్తిగా సడలిపోయి– హృదయం అర్థమైందేమో– కళ్లల్లోకి నీళ్లు వొచ్చేశాయి ఒక్కసారిగా.

"క్షమించవూ నన్ను కళ్యాణీ! నేను– అజ్ఞానంకొద్దీ చేయరాని నేరం చేశాను నీకు. అమాయకత్వం కొద్దీ దిద్దుకోలేని పెద్ద పొరపాటు చేశాను నీ పట్ల. తెలివి తక్కువతనంతో నిన్నూ వంచించాను, నన్నూ వంచించుకున్నాను. ఇద్దరి జీవితాలనూ నాశనంచేశాను."

"ఏమిటి మీరనేది? మీ మాటలు నాకేమీ అర్థంకావడంలేదు." కంగారుగా అందామె.

"అర్థంకాలేదూ? ఎంత అమాయకురాలివి! ఇంకా నీకు తెలియలేదూ మనం చిత్తుగా మోసగించబడ్డామని? బాధ్యతలూ బరువులూ తీరేవరకూ జీవితాన్ని కోరికలనీ సరదాలనీ వాయిదా వేసుకుంటూ– భవిష్యత్తులో సుఖపడవచ్చు ననుకుంటూ వర్తమానాన్ని బలిచేసున్నాం. ఎదురు చూసిన శుభదినమయితే వచ్చింది. కాని ఆశించిన జీవితం అందకుండా పోయే ట్లుంది. కొత్త జీవితాన్ని ప్రారంభించ బోతే మనుషులకి మనం వింతమృగాల్లా కనిపిస్తున్నాం! బెటర్ లేట్ దేన్ నెవర్ అన్నది వట్టి అబద్ధం.... లేటీజ్ నెవర్.... అదే నిజమనిపిస్తూంది. ఆలస్యం అమృతం విషం. నా బాధ ఎందుకంటే.... నా అజ్ఞానంలో నా జీవితంతోపాటు జీవితమూ నాశనం చేశాను." ఆ కంఠం నిండా విషాదమే.

"వొద్దు. అలా మాట్లాడకండి. నేను వినలేను. భరించలేను."

"నా గుండెలలో రేగుతున్న అగ్ని పర్వతాలు నన్ను దహించివేస్తున్నాయి నిలువునా. మనం ఎంత దగాపడ్డాం!"

"జరిగినదేదో జరిగిపోయింది. విచారించి మాత్రం ఏం లాభం యిప్పుడు? ఈ డబ్బు దాచుతాను, యివ్వండి." అందామె.

ఆయన నోట్లకట్టలను బయటకు తీసి వాటివేపు వెర్రివాడిలా చూశాడు. "కళ్యాణీ, నిజంగా డబ్బు పాపిష్టిదే సుమా! దాని అవసరం మనకి చాలా ఉన్నప్పుడేమో అది మనకి అందుబాటులో లేకపోయింది. ఇప్పుడు దాని ఉపయోగం మనకు అట్టే లేదు. పుష్కలంగా లభించింది. అత్యవసరమైనప్పుడు అందకా, అనవసరమైనప్పుడు అధికమై– రెండువిధాలా డబ్బు మనుషులకి దుఃఖమే కలుగజేస్తుందేమో! ఇంత డబ్బు– అప్పుడుంటే మన సరదాలూ కోరికలూ తీరేవి కాదూ? నీకు నగలూ మంచి మంచి చీరెలూ... నాకు సూట్లూ, వాచీ...."

ఇంక ఆమె భరించలేనట్లు కన్నీళ్ళు నింపుకుని.... డబ్బు బీరువాలో దాచి వొచ్చి– "మీరు విశ్రాంతి తీసుకోండి, నిద్రకావాలిస్తే సాయంత్రం షికారుక్కో

వెళ్దాం. మనసుకి హాయిగా ఉంటుంది." అంది కల రాస్తూ.

"పార్కుకి వెళితే— ముసలోళ్ళకి పార్కులేమిటంటారేమో ఏ మూర్ఖులయినా ..."

"పార్కుకి పోకపోతే షికారు... మంచం మీద కళ్ళుమూసుకుని పడుకో ఇంక దయచేసి."

"సరే క్షమించానను కళ్యాణీ అంతవరకూ నాకు నిద్రపట్టదు."

"అలాగే లెండి." అందామె విధి లేనట్లు. మెల్లగా ఆయనను నిద్రపుచ్చింది.

నాలుగు దాటుతుంటే ఆయనకు మెలకువ వచ్చింది. మనసు కొంచెం తేలికైనట్లుంది. నిద్రపోయి లేవాక చల్లటి నీటితో స్నానం— మరికొంత ఉత్సాహం కలిగించింది. కళ్యాణి టీ తీసుకొచ్చింది ఇద్దరికీ. టీ తాగుతుంటే ఆయన మనసు మరింత చురుకుగా కదిలిందేమో! ఈ మూర్ఖులనీ [illegible] లనీ ఆలోచనలనీ కాదని మనం మన [illegible] పరదాలు తీసుకోబోతే ఏమౌతుంది కళ్యాణీ? [illegible] అడిగాడు హటాత్తుగా. ఆమె అర్థంకానట్లు చూసింది.

"అంటే నువ్వు జార్జెట్ చీర కట్టుకుని.... రవ్వల నెక్లెస్ పెట్టుకుని...."

"వద్దు—" అందామె తలదించుకుని.

"ఎందుకని?" దెబ్బతిన్నట్లు అడిగాడు.

"నేను అటువంటి చీర కట్టుకున్నా, మీరు సూటు వేసుకున్నా— నిజానికి అది మనకోసం కాదు. ఎదుటివారి కంటికి గొప్పగా కనిపించాలన్న తాపత్రయం కోసమే. ఔనా?"

"ఊఁ" అన్నారాయన కాదనలేనట్లు.

"వాళ్ళు హర్షించక నవ్వడం మొదలుపెడతారు. అప్పుడు మనకి సుఖమేముంటుంది బాధ తప్ప?"

ఓటమిచెందినవాడిలా.... దెబ్బమీద దెబ్బ తగిలినట్లు ఆయన అవాక్కయి పోయాడు.

"మీరిక అనేమీ ఆలోచించకండి. చల్లబడుతోంది. బట్టలు వేసుకుంటే కొంతసేపు అలా తిరిగివొద్దాం."

"ఊఁ" ఆయన నీరసంగా లేవబోతుంటే ...

"రామనాథంగారూ!" అంటూ పిలుపు బయటనుంచి.

"కాశీపతిలా ఉన్నాడు." అంటూ గది బయటకు వచ్చాడు.

కాశీపతే.

"రా.... కూర్చో.... ఏమిటి విశేషాలు?" ఆహ్వానించాడు.

కాశీపతి కూర్చుంటూ— "విశేషమేమీ లేదు. చిన్న శుభవార్త చెబుదామని. చెల్లెమ్మ ఏదీ?" అడిగాడు.

టీ పట్టుకుని రానే వచ్చింది కళ్యాణి.

"టీ తీసుకోండి అన్నయ్యగారూ...."

"ఇప్పుడెందుకమ్మా...." అంటూనే కప్పు తీసుకుని— "బావగారు రిటైరయి



పోయారు. అంతా తీరుబడేగా యిక? అమ్మాయి అత్తారింటికీ అబ్బాయి ఉద్యోగానికి వెళ్లిపోయారు. బరువులూ బాధ్యతలూ తీరిపోయాయి. అదృష్టవంతులు." అన్నాడు ఉపోద్ఘాతంలా.

రామనాథం మౌనంగా ఉండిపోయాడు.

"ఐహికం మేరకు వొడ్డెక్కినట్లే. మీ కే చీకూచింతా లేదు. పెద్దవారై పోయారు. వృద్ధాప్యంలో అడుగు పెట్టారు."

రామనాథం ఎందుకో తుళ్ళిపడ్డాడు.

"ఇక యిహలోక ధ్యాస తగ్గించుకుని పరలోక చింతన ప్రారంభించాలి. మానవ జీవితమంటే– ఐహికమే కాదు, ఆముష్మికం కూడా"

కాశీపతి మాటలు– రామనాథంగారికి చేదు మాత్రలు మింగుతున్నట్లుగానే ఉంది.

"పోయేనాడు మన వెంట ఏదీ రాదు. చనిపోయాక ఏమిటన్నది కూడా ఆలోచించవలసిన విషయమే మీరేమీ నాస్తికులు కారుగా. నాస్తికులు కూడా వృద్ధాప్యం వచ్చేసరికి ఆస్తికులై పోతారు సాధారణంగా, మృత్యువుమీద భయంకొద్దీ. చెప్పవచ్చే దేమిటంటే– శంకరమఠానికి చిదానందస్వామి వచ్చారు. ఇవాళ్టినుంచే భగవద్గీత చెబుతారు. అందరికీ అర్థమయ్యేలా సులభ భాషలో చక్కగా చెబుతారు మరో అరగంటలో మేము బయల్దేరబోతున్నాం మీకు పనేమీ ఉండదుగా మీరూ వస్తారేమో అని.. ఊహుఁ తప్పకుండా వచ్చి గీతోపన్యాసాలు విని– మీ జన్మ ధన్యం చేసుకోవాలని "

కళ్యాణి జాలిగా భర్త వేపు చూసింది

"అలాగే..." అన్నారాయన తప్పని సరి అయినట్లు.

"సిద్ధంగా ఉండండి యిద్దరూ. అర గంటలో బయలుదేరుదాం." హెచ్చరించి వెళ్లాడు కాశీపతి.

రామనాథం ముఖంలో ఒక్కసారి ఎంతో మార్పు. ఒక్కసారిగా ఎంతో ముసలివాడై పోయినట్లు

చూస్తున్న కళ్యాణి చేష్టలుడిగి నిలబడిపోయింది.

"కళ్యాణీ!" మెల్లగా. బలహీనమైన స్వరంతో పిలిచాడు. మానవుడు ఎప్పటికీ అస్వతంత్రుడే సుమా! నిజంగా అతని కెప్పటికీ నిజమయిన స్వేచ్ఛ లభించదు. జీవన చదరంగంలో మనుషులు కేవలం పావులు. ఇది తిరుగులేని నిజం."

ఆమె జాలిగా చూస్తూ మిగిలిపోయింది.

కొన్ని గంటలలో ఆయనను ఎంత వృద్ధులని చేయగలిగాయి సంఘటనలు. ఆయనలో ఎంత మార్పుని తీసుకు రాగలిగాయి!

వేళౌతుందేమో బట్టలు అందుకో," అన్నారాయన నిర్లిప్తంగా.

